క్లుప్తంగా

ప్రజారోగ్యానికి ప్రాధాన్యత



సీఎం సహాయనిధి చెక్కును అందజేస్తున్న ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: ప్రజారోగ్యానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అత్యంత ప్రాధాన్యతనిస్తున్నారని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్ మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణానికి చెందిన ప్రశాంత్ అనే వ్యక్తికి సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.65 వేల చెక్కును మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో లబ్ధిదారుడికి అందజేశారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ ఆరోగ్య శ్రీ జాబితాలో లేని వ్యాధులకు చికిత్స కోసం ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి సహకారంతో సీఎం సహాయనిధి నుంచి రోగులకు ఆర్థిక సహాయం అందించి ఆదుకుంటున్నట్లు తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్ తదితరులు ఉన్నారు.

ఆకట్టుకుంటున్న చేనేత హస్తకళా మేళా



మగువల మనసుదోచే ముత్యాల హారాలు

ఎమ్మిగనూరు: పట్టణంలోని సోమప్ప మెమోరియల్ హాల్‌లో గ్రామీణ వీవర్స్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన హస్తకళా మేళా అందరినీ ఆకట్టుకుంటోంది. ఈ మేళాలో చేనేతలు తయారు చేసిన పోచంపల్లి, మంగళగిరి, ధర్మవరం, గద్వాల, తదితర పట్టుచీరలు, కొండపల్లి, ఏటికొప్పాక చెక్క బొమ్మలు, ముత్యాలు, జూట్, లెదర్ బ్యాగులుతో పాటు వివిధ గృహ అలంకరణ వస్తువులు మగువల మనస్సు దోచేస్తున్నాయి. మేళాలో కళాకారులచే నేరుగా విక్రయాలు చేపడుతారు. ఏప్రిల్ 9వ తేదీ వరకు మేళా ఉంటుందని వీవర్స్ సొసైటీ నిర్వాహకులు పేర్కొన్నారు.

గేట్ ఫలితాల్లో ప్రతిభ



పి.సిరాజ్ మొమిర్

ఎమ్మిగనూరుటౌన్: ఇటీవల విడుదలైన గేట్ ఫలితాల్లో పట్టణానికి చెందిన పి.సిరాజ్‌మొమిర్ ఆలిండియా స్థాయిలో 95వ ర్యాంకు సాధించాడు. సిరాజ్ బీటెక్ కంప్యూటర్ సైన్స్ తిరుపతి ఎస్వీ యూనివర్సిటీలో చదివి గేట్ పరీక్షలకు సిద్ధమైనట్లు తెలిపారు. మంచి ర్యాంక్ సాధించిన ఆయన్ను మంగళవారం స్థానికులు అభినందించారు.

బాధ్యులపై చర్యలు తీసుకోండి

ఎమ్మిగనూరుటౌన్: జిల్లా కేంద్రంలో వార్తల సేకరణకు వెళ్లిన మీడియా ప్రతినిధులపై దాడులు చేసిన అగ్రసేనిఆసుపత్రి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఏపీయూడబ్ల్యూజే నాయకులు శ్రీనివాసులు నాయుడు, పరమేశ్వర డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డీటీ ఏజాజ్‌అహమ్మద్‌కు ఇచ్చారు. వారు మాట్లాడుతూ దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో సత్తా



యోగా పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఎమ్మిగనూరుటౌన్: బుద్ధయోగ హెల్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గత ఆదివారం నర్సాపురంలో జరిగిన రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో స్థానిక వీ వర్స్ కాలనీ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థు లు సత్తా చాటారు. ఈ పోటీల్లో 9 జిల్లాల నుంచి 176 మంది విద్యార్థులు పాల్గొనగా స్థానిక పాఠశాలకు చెందిన 6వ తరగతి విద్యార్థి వెంక టసాయి ఓవరాల్ ఛాంపియన్‌షిప్ సాధించగా, ఈశ్వర్ ద్వితీయ స్థానం కైవసం చేసుకున్నాడు. వారికి సంస్థ చైర్మన్ వెంకటరామ కుమార్ మెడ ల్స్‌తో పాటు ప్రసంశాపత్రాలను అందించారు. ఈ సందర్భంగా మంగళవారం స్థానిక పాఠశా లలో ప్రతిభచాటిన విద్యార్థులతో పాటు యోగా టీచర్ కుమారి భవానిని ప్రధానోపాధ్యాయులు రాగన్న, ఉపాధ్యాయులు అభినందించారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

గోనెగండ్ల: పదో తరగతి విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదువుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని హెచ్ఎం నాగభూషణం, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి నరసింహులు సూచించారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గోనెగండ్ల జెడ్పీ హైస్కూల్, కేజీబీవీలోని పదో తరగతి విద్యార్థులకు ప్రజ్ఞా వికాసం టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు వీరన్న ఆధ్వర్యంలో మంగళవారం బహుమతులు పంపిణీ చేశారు. ఆ సంఘం నాయకులు పాల్గొన్నారు.

రాగి జావ.. పిల్లలకు సలువ

ఎమ్మిగనూరుటౌన్: విద్యార్థులకు పోషకాహారం అందించాలన్న ఉద్దేశంతో జగనన్న గోరుముద్దలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాగిజావను పట్టణంతో పాటు మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థులకు మంగళవారం పంపిణీ చేశారు. స్థానిక ఎంఎస్ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు హెచ్ఎం గౌసియాబేగం పంపిణీ చేశారు.

నందవరం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఉరుకుంద, ఎంఈఓ సుదర్శన్‌రెడ్డి రాగి జావ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

గోనెగండ్ల: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఏపీ మోడల్ స్కూల్‌లో ఎంపీపీ టీ.నసురుద్దీన్, ఎంఈఓ వినోద్ కుమార్‌తో కలిసి విద్యార్థులకు రాగి జావ పంపిణీ చేశారు.

ఎమ్మిగనూరురూరల్: గువ్వలదొడ్డి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతో పాటు రాగి జావ ఇచ్చారు. ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు రాగి జావా రుచిచూసి సంతృప్తి వ్యక్తం చేశారు. చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం జిల్లా కన్వీనర్ లింగన్నగౌడ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



గువ్వలదొడ్డి ఎంపీపీ పాఠశాలలో రాగిజావ తాగుతున్న విద్యార్థులు

వెల్దుర్తి: స్థానిక ఎంపీపీ మెయిన్‌స్కూల్, జెడ్పీ బాలుర, బాలికల పాఠశాలల్లో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్/ఎంపీటీసీ బొమ్మన రవిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు సమీర్‌కుమార్ రెడ్డి, పట్టణ కన్వీనర్ వెంకట్‌నాయుడు, తదితరులు విద్యార్థులకు రాగి జావ పంపిణీ చేశారు.

మద్దికెర: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నతపాఠశాలలో రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని జెడ్పీటీసీ దేవిరెడ్డి మురళీధర్‌రెడ్డి, ఎంపీపీ డీఎస్ అనితాయాదవ్, సర్పంచ్ బండారు సుహాసిని ప్రారంభించారు.

కృష్ణగిరి: స్థానిక ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు రాగి జావ పంపిణీ కార్యక్రమాన్ని హెచ్ఎం రమ, వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రహ్లాద, పరుశరాముడుతో కలిసి ప్రారంభించారు.

తుగ్గలి: జొన్నగిరి, తుగ్గలి, పెండేకల్లు జంక్షన్ జెడ్పీ హెచ్ఎస్‌లో వైస్ ఎంపీపీ ఎర్ర నాగప్ప, ఎంపీటీసీ రాజు, పీఎంసీ చైర్మన్లు రఘు, నాగరాజు హెచ్ఎంలతో కలిసి విద్యార్థులకు రాగి జావ పంపిణీ చేశారు.

ఆలూరు: హాలహర్వి మండలం అర్థగేరి, దేవనకొండ మండలం కప్పట్రాళ్ల గ్రామ ప్రభుత్వ పాఠశాలల్లో చింతకుంట సింగిల్‌విండో అధ్యక్షుడు శ్రీనివాసులు, దేవనకొండ మండల కన్వీనర్ మల్లికార్జున హెచ్ఎంలు రామ వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయుల సమక్షంలో రాగిజావను విద్యార్థులకు అందజేశారు.

చిప్పగిరి: మండలంలోని ఏరూరు జెడ్పీహెచ్ హైస్కూల్‌లో సచివాలయ కన్వీనర్ రాజన్న, పీఎంసీ చైర్మన్ బాలకృష్ణ ఆధ్వర్యంలో విద్యార్థులకు రాగి జావ పంపిణీ ప్రారంభించారు.

ఆస్పరి: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో మండల సొసైటీ చైర్మన్ కట్టెల గోవర్ధన, పీఎంసీ చైర్మన్ చిన్న గోవర్ధన విద్యార్థులకు రాగి జావ అందజేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

హొళగుంద: మండలంలోని వందవాగిలి, ఎల్లార్తితో పాటు ఆయా గ్రామాలలో ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న గోరుముద్దతో పాటు రాగిజావ పంపిణీని వైఎస్సార్‌సీపీ నాయకులు మేలగిరి, ఎస్కే గిరి, లక్ష్మీకాంత్‌రెడ్డి, పీఎంసీ చైర్మన్లు భీరలింగ, లక్ష్మి తదితరులు ప్రారంభించారు.



కప్పట్రాళ్ల జెడ్పీ హైస్కూల్లో రాగిజావ పంపిణీ చేస్తున్న దృశ్యం.



ఎరుకలచెరువు జెడ్పీ ఉన్నత పాఠశాలలో...



వెల్దుర్తి పాఠశాలలో రాగి జావ బాగుందంటూ తాగుతున్న విద్యార్థులు

క్షయ నివారణపై అవగాహన

హొళగుంద: చాలా మంది క్షయ వ్యాధిని సకాలంలో గుర్తించలేకపోతున్నారని, వ్యాధి పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని డాక్టర్ రాధమ్మ, టీబీ సుపర్‌వైజర్ గోపాల్ ఎంఎల్‌హెచ్‌పీలకు సూచించారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో క్షయ వ్యాధికి సంబంధించి అవగాహన, నిర్మూలన చర్యలు ఇతర అంశాలపై సమావేశం నిర్వహించారు. రెండు వారాలకు మించి దగ్గడం, ఆకలి తగ్గిపోవడం, ఛాతిలో నొప్పి, బరువు తగ్గడం, సాయంత్రం జ్వరం రావడం లాంటి లక్షణాలు కనిపిస్తే ఆరోగ్య కేంద్రంలో గళ్ల పరీక్ష చేయించుకునేలా చూడాలని చెప్పారు. క్షయ వ్యాధి ఉన్నట్లు తేలితే ఆరు నెలల పాటు మందులు వాడాలని సక్రమంగా వాడకపోతే జరిగే అనర్థాల గురించి వివరించాలన్నారు. క్షయ వ్యాధి సమూల నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి



మాట్లాడుతున్న ఆర్డీఓ మోహన్‌దాస్

ఆలూరు: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని పత్తికొండ ఆర్డీఓ మోహన్‌దాస్, హౌసింగ్ ఈఈ గురుదాస్ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఆయా గ్రామాల ప్రత్యేక అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన దేవనకొండ ఎంపీడీఓ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఆయా గ్రామ సచివాలయ పరిధిలోని ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి సాధించాలని, లక్ష్యానికి చేరువై గృహ ప్రవేశాలు జరిగేలా చూడాలని ఆదేశించారు. గృహాలు నిర్మించుకునేలా లబ్ధిదారులను చైతన్యం చేయాలన్నారు. తహసీల్దారు సుదర్శనం, హౌసింగ్ ఏఈ అనిరుధ్‌బాబు, వర్క్ ఇన్‌స్పెక్టర్ నీలకంఠేశ్వర నాయుడు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహభావం

తుగ్గలి: క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందని సర్పంచ్ మస్తాన్‌బీ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నబిరసూల్ అన్నారు. ఉగాది పండుగ సందర్భంగా గ్రామ పెద్దల ఆధ్వర్యంలో కడమకంట్లలో ఏర్పాటు చేసిన కబడ్డీ పోటీలను మంగళవారం సాయంత్రం వారు ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్న అనంతరం వారు మాట్లాడారు. క్రీడలతో శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. ఇలాంటి పోటీలు నిర్వహించడం వల్ల ఉత్తమ ప్రతిభ వెలుగులోకి వస్తుందన్నారు. పోటీలలో గెలుపొందిన జట్లకు వరుసగా రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు నగదు బహుమతులు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఎంపీటీసీ సభ్యులు ఆదిలక్ష్మి, రాజు, సీపీఐ నాయకులు సుల్తాన్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



కడమకుంట్లలో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సర్పంచ్

దివ్యాంగ చిన్నారులకు ఫిజియోథెరపీ సేవలు

వెల్దుర్తి: డౌన్ సిండ్రోమ్ అనేది పిల్లల్లో జన్యు సంబంధిత వ్యాధి అని దీన్ని త్వరగా గుర్తించి, తగిన చికిత్స అందిస్తే పిల్లలను చాలావరకు మామూలుగా ఎదిగేలా చేయవచ్చని స్థానిక భవిత కేంద్రం ఫిజియోథెరపిస్ట్ జి.కిరణ్ మనోహర్ తెలిపారు. ప్రపంచ డౌన్ సిండ్రోమ్ డే సందర్భంగా మంగళవారం ఆయన స్థానిక ఎంపీపీ మెయిన్ స్కూల్‌లో సమగ్ర శిక్ష అభియాన్ నిర్వహిస్తున్న భవిత కేంద్రంలో దివ్యాంగులైన పిల్లలకు వారి తల్లిదండ్రులు, ఈఓఆర్‌పీల సహకారంతో ఫిజియోథెరపీ చేయించారు. 25 మంది రెగ్యులర్ స్టూడెంట్‌లు, 10మంది హోమ్ బేస్డ్ ఎడ్యుకేషన్ విద్యార్థులకు ఫిజియోథెరపీ చికిత్స అందించారు. పిజియోథెరపీ ద్వారా వైకల్య శాతం తగ్గి సొంతంగా పనులు చేసుకునేందుకు అవకాశం ఉంటుందని వివరించారు. భవిత కేంద్రం ఉపాధ్యాయులు (ఐఈఆర్‌పీ) నిర్మల శాంతకుమారి, అరుణమ్మ పాల్గొన్నారు.



వెల్దుర్తి భవిత కేంద్రంలో దివ్యాంగ చిన్నారులకు ఫిజియోథెరపీ చేయిస్తున్న డాక్టర్ జి.కిరణ్‌మనోహర్

వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం

గోనెగండ్ల: పదవ తరగతిలో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేస్తున్నామని సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ డాక్టర్ కె.వేణుగోపాల్ పేర్కొన్నారు. గోనెగండ్లలో మంగళవారం రాత్రి పదో తరగతి విద్యార్థుల ఇళ్లకు వెళ్లి పరీక్షలకు సన్నద్ధమయ్యే విధానాన్ని పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఉత్తమ ఫలితాలు సాధించేలా తమ వంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు భయం వీడి పరీక్షలకు సన్నద్ధం కావాలని, ఏకాగ్రతతో చదవాలని సూచించారు. సందేహాలుంటే ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలన్నారు. అనంతరం 8వ తరగతి విద్యార్థుల ఇళ్లకు ప్రభుత్వం అందించిన ట్యాబ్‌ల వాడకాన్ని పరిశీలించి ఆవశ్యకతను తెలియజేశారు. ప్లానింగ్ కో–ఆర్డినేటర్ పి. మారుతి, గర్ల్స్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ పి.సునీత ఉన్నారు.



గోనెగండ్లలో విద్యార్థిని సామర్థ్యాన్ని పరీక్షిస్తున్న ఏపీసీ డాక్టర్ కె.వేణుగోపాల్

జయప్రదం చేయండి

హొళగుంద: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేస్తున్న నమ్మక ద్రోహంపై ఈ నెల 27, 28 తేదీల్లో ఎంఎస్‌పీఎంఈఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ హొళగుంద మండలాధ్యక్షుడు, గౌరవధ్యక్షుడు హెబ్బటం ఫక్కీరప్ప, నాగరకణ్వీ వెంకటేష్ పిలుపునిచ్చారు. మంగళవారం వారు హొళగుందలో కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ.. వంద రోజుల్లో ఎస్సీ వర్గీకరణ చేస్తానని చెప్పిన బీజేపీ తర్వాత మోసం చేసిందని దుయ్యబట్టారు. తక్షణమే ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టాలని డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ ఆదేశాల మేరకు ఎస్సీల రిజర్వేషన్ వర్గీకరణ కోసం మాదిగలు, మరో 57 ఉప కులాలు సిద్ధం కావాలన్నారు. ఎమ్మార్పీఎస్ నాయకులు సిద్ధప్ప, శేషగిరి, యెహోన, సినిమా మంగన్న, , బజారి, తాయప్ప తదితరులు పాల్గొన్నారు.

4న నగరాల ముట్టడి

ఆస్పరి: ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఏప్రిల్ 4వ తేదీన హైదరాబాద్, విజయవాడలో చేపట్టే నగరాల ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు సంజప్ప పిలుపునిచ్చారు. మంగళవారం ఆస్పరిలో నగరాల ముట్టడి కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఎంఆర్‌పీఎస్ నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా సంజప్ప మాట్లాడుతూ పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించే వరకు పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు శ్రీనివాసులు, మల్లికార్జున, మునిస్వామి, గోపాల్, శివ, శ్రీరాములు, ఈరన్న, బొజ్జప్ప, మల్లేష్, మానంది, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో అమావాస్య పూజలు

ఆస్పరి: ఆస్పరిలోని మారెమ్మవ్వ, కైరుప్పలలోని వీరభద్రస్వామి, తంగరడోణలోని చింతలముని, నల్లారెడ్డి స్వామి, రామతీర్థంలో వెలసిన గాయత్రీ మాత, రామలింగేశ్వర స్వామి ఆలయాలలో బుధవారం అమావాస్య పూజలు నిర్వహించారు. రామతీర్థం ఆలయంలో నిర్వాహకులు రూపామోహన్ శర్మ, శాంతిరెడ్డి, మల్లికార్జున స్వామి ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమార్చన, హోమం, మంగళహారతులు తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

చిన్నారి ఆపరేషన్‌కు చేయూత

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని చందోలి గ్రామానికి చెందిన కుమ్మరి లక్ష్మన్న కుమారుడు జశ్వంత్(9)కు క్యాన్సర్ చికిత్స కోసం సీఎం సహాయ నిధి నుంచి రూ.12 లక్షల చెక్కు మంజూరైంది. ఈ చెక్కును ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి బాధిత కుటుంబ సభ్యులకు మంగళవారం అందజేశారు. బాలుడికి అనారోగ్యంగా ఉండడంతో కుటుంబ సభ్యులు కర్నూలు ఆసుపత్రికి తీసుకెళ్లగా వైద్యులు హైదరాబాద్ ఎంఎన్‌జే హాస్పిటల్‌కు రెఫర్ చేశారు. అక్కడ క్యాన్సర్ వ్యాధిగా నిర్ధారణ అయ్యింది. హైదరాబాద్‌లోని అమెరికన్ అంకాలజీ ఇన్‌స్టిట్యూట్‌కు రెఫర్ చేయగా బాలుడి చికిత్సకు రూ.12 లక్షలు ఖర్చవుతుందని అక్కడి వైద్యులు తెలిపారు. దీంతో బాధిత కుటుంబం ఎమ్మెల్యేను ఆశ్రయించగా వారి దీనస్థితిని చూసి చలించిపోయారు. సమస్యను సీఎం వైఎస్ జగన్ దృష్టికి తీసుకెళ్లి చికిత్స కోసం రూ.12 లక్షలు మంజూరు చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు బాధిత కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



చిన్నారి కుటుంబానికి రూ.12 లక్షల చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి



క్యాన్సర్‌తో బాధపడుతున్న జశ్వంత్

ఆప్కాబ్ టీమ్‌పై అనుచిత వైఖరి

- పత్తికొండ బ్రాంచ్ మేనేజర్‌పై సస్పెన్షన్ వేటు?

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు జిల్లా సహకార కేంద్రబ్యాంకు పత్తికొండ శాఖకు తనిఖీకి వెళ్లిన ఆప్కాబ్ టీమ్ పట్ల మేనేజర్ అనుచితంగా వ్యవహరించారు. ఆప్కాబ్ డీజీఎం సత్యప్రసాద్, మరో ముగ్గురు ఆప్కాబ్ మేనేజర్లు పత్తికొండ బ్రాంచ్‌కి వెళ్లారు. వీరి వెంట జిల్లా సహకార కేంద్రబ్యాంకు ఏజీఎం కృష్ణమూర్తి కూడా ఉన్నారు. అయితే బ్రాంచ్ మేనేజర్ వారి పట్ల అమర్యాదగా ప్రవర్తించడంతో ఆందోళనకు గురయ్యారు. మీ ఐడీ కార్డులు ఏవీ, మెడలో వేసుకోవాలి కాదా.. ఆ మాత్రం తెలియదా... అంటూ నిర్లక్ష్యంగా మాట్లాడారు. దీంతో వారు కంగుతినాల్సి వచ్చింది. విషయాన్ని వెంటనే డీసీసీబీ ముఖ్య కార్యనిర్వహణాధికారి రామాంజనేయులుకు ఫోన్ చేసి తెలియజేశారు. స్పందించిన ఆయన మేనేజర్‌పై తీవ్ర అసంతృప్తి, ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా సస్పెన్షన్ వేటు వేయాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది.

గురుకులం దరఖాస్తులకు ముగుస్తున్న గడువు

వెల్దుర్తి: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఎస్సీ గురుకుల విద్యాలయాలలో 2023–24 సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 24వ తేదీ వరకు మాత్రమే గడువు ఉంది. ఈ సందర్భంగా వెల్దుర్తి ఎస్సీ బాలికల గురుకులం ప్రిన్సిపాల్ మంగళవారం మాట్లాడుతూ.. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ప్రవేశపరీక్ష నిర్వహించి గురుకులం ప్రవేశాలు కల్పించనున్నట్లు వెల్లడించారు. 5వ తరగతిలో ప్రవేశాలకు ఏప్రిల్ 23న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఇంటర్మీడియెట్ ప్రవేశాలకు అదే రోజు మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ప్రవేశపరీక్ష ఉంటుందన్నారు. మరింత సమాచారం కొరకు https://apgpcet.apcfss.in వెబ్‌సైట్‌ను సంప్రదించవచ్చన్నారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

గోనెగండ్ల: మండలంలో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టులకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ కోరారు. ఆయన మంగళవారం మాట్లాడుతూ.. గోనెగండ్ల మండలంలో బైలుప్పల–1, గోనెగండ్లకు –2, హెచ్.కైరవాడి–1, పెద్దనేలటూర్–2, కులుమాల–1 చొప్పున ఏడు పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈనెల 24వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నందవరం: మండలంలో ఖాళీగా ఉన్న గురజాల –1 (బీసీ–పురుషుడు), హాలహర్వి–1 (బీసీ–ఏ మహిళ), నందవరం–1 (ఎస్టీ మహిళ), టి.సోమలగూడూరు–2లో (బీసీ–బీ పురుషుడు) వలంటీర్ పోస్టులకు అర్హులైన అభ్యర్థులు ఈ నెల 24వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ కృష్ణమూర్తి సూచించారు. 25న దరఖాస్తుల పరిశీలన, 27న మౌఖిక పరీక్ష, 28న ఎంపికైన వారి వివరాలను తెలియజేస్తామన్నారు. ఎంపికైన అభ్యర్థులకు 30వ తేదీ శిక్షణా కార్యక్రమం, 31వ తేదీ నుంచి విధులకు హాజరు కావలసి ఉంటుందన్నారు. దరఖాస్తుదారులు 10వ తరగతి లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణత సాధించి ఉండాలన్నారు.

మద్దికెర: మండలంలో ఖాళీగా ఉన్న మద్దికెరలో–3, బురుజులలో–1 వలంటీర్ పోస్టులకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ నరసింహమూర్తి సూచించారు.

పరీక్షలంటే భయం వీడాలి

ఎమ్మిగనూరుటౌన్: పదో తరగతి విద్యార్థులు పరీక్షలంటే భయం వీడాలని అప్పుడే మంచి ఫలితాలు సాధిస్తారని ఎంఈఓ ఆంజనేయులు సూచించారు. మంగళవారం పట్టణంలోని గ్లోబల్ స్కూల్‌లో రాయలసీమ పరిరక్షణ స్టూడెంట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 'పరీక్షలంటే భయమెందుకు' అన్న అంశంపై నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న అయన మాట్లాడారు. విద్యార్థులు ఏకాగ్రతతో చదివి మంచి మార్కులు సాధించాలన్నారు. విద్యావేత్త మహానందయ్య, సమాజసేవకుడు మల్లెల ఆల్‌ఫ్రెడ్‌రాజు ప్రసంగించారు.

పౌష్టికాహారం పంపిణీ

కృష్ణగిరి: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే గర్భవతులు, బాలింతలు, చిన్నారులకు నాణ్యతతో కూడిన పౌష్టికాహారాన్ని అందిస్తున్నట్లు క్లస్టర్ సూపర్‌వైజర్ తిప్పమ్మ తెలిపారు. మండల పరిధిలోని కంబాలపాడు అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం జరిగిన పోషణ్ మాసోత్సవాల్లో ఆమె పాల్గొని పౌష్టికాహారాన్ని అందజేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు సునీత, వెంకటలక్ష్మి సుశీలమ్మ పాల్గొన్నారు.

పాఠశాలలో అపరిశుభ్రతపై సబ్‌కలెక్టర్ ఆగ్రహం

ఎమ్మిగనూరురూరల్: మీ ఇంటి పరిసరాలను ఇలాగే అపరిశుభ్రంగా ఉంచుకుంటారా? పాఠశాల ఆవరణలో మలవిసర్జన చేస్తుంటే మీరేమి చేస్తున్నారంటూ ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ ఉపాధ్యాయ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన మంగళవారం మండల పరిధిలోని కోటేకల్ జిల్లా పరిషత్ పాఠశాలను ఆకస్మిత తనిఖీ చేశారు. పాఠశాల గదులు,పరిసరాలు, మరుగుదొడ్లను పరిశీలించారు. నాడు–నేడు ద్వారా జరుగుతున్న పనులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ఆవరణలో మూత్ర, మల విసర్జన చేసి ఉండటం చూసి హెచ్ఎం, ఉపాధ్యాయులు, అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాల అంటే విద్యార్థులను భావి పౌరులుగా తీర్చిదిద్దేదేవాలయం లాంటిదని గుర్తుంచుకోవాలని హితవు పలికారు. ప్రతి ఒక్కరు బాధ్యతగా వ్యవహరిస్తే పాఠశాలను బాగు చూసుకోవచ్చన్నారు.తరగతి గదుల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యార్థినులతో మాట్లాడి.. ఉపాధ్యాయులు చెబుతున్న పాఠాలు అర్థమవుతున్నాయా, బోధన ఎలా ఉంది అని ఆరాతీశారు.



కోటేకల్ జెడ్పీ పాఠశాలలో విద్యార్థినితో మాట్లాడుతున్న ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్

కోటేకల్ సచివాలయం తనిఖీ

గ్రామంలోని సచివాలయంను సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ తనిఖీ చేశారు. సిబ్బంది హాజరుపట్టిక, మూమెంట్ రిజిస్టర్, రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో వైరల్ ఫీవర్‌పై అప్రమత్తంగా ఉండాలని, ఫీవర్ సర్వే చేయించాలన్నారు.గర్భిణుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ వారికి సరైన వైద్యసేవలు అందించాలని సూచించారు. మండలస్థాయి అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు.తహసీల్దార్ జయన్న, ఎంపీడీఓ బంగారమ్మ, ఎంఈఓ ఆంజనేయులు, సచివాలయ సిబ్బంది, గ్రామ నాయకులు ఉన్నారు.

క్రైం కార్నర్

కత్తిపోట్లకు గురైన మహిళ మృతి



మహముదా (ఫైల్)

మద్దికెర: స్థానిక మోమిన్ వీధిలో ఉంటున్న మహముదా (35)ను భర్త అహ్మద్ కత్తితో పొడవడంతో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. వివరాలు.. మద్దికెరకు చెందిన గౌస్‌మోదీన్, జుబేదాకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. పెద్ద కుమార్తె మహముదాను గుంతకల్లుకు చెందిన రసూల్ కుమారుడు అహ్మద్‌కు ఇచ్చి 2009లో వివాహం జరిపించారు. వారికి ఒక కూతురు, కుమారుడు ఉన్నారు. ఆరు నెలల క్రితం దంపతుల మధ్య మనస్పర్థలు తలెత్తడంతో విడిపోయారు. ఈ క్రమంలో అహ్మద్ సోమవారం మద్దికెరకు వచ్చి భార్యపై కత్తితో దాడిచేయగా ఆమె తీవ్రంగా గాయపడింది. కుటుంబసభ్యులు చికిత్స కోసం గుంతకల్లు వైద్యశాలకు తరలించారు. ఆమె కోలుకోలేక మంగళవారం మృతి చెందింది. తల్లి చనిపోవడంతో ఇద్దరు చిన్నారులు తల్లడిల్లిపోయారు.

గాయపడిన వృద్ధురాలి మృతి

పత్తికొండ రూరల్: దున్నపోతు పొడవడంతో తీవ్రంగా గాయపడి కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న కొండగేరికి చెందిన శేషగిరి నాగమ్మ (90) మంగళవారం మృతి చెందినట్లు సీఐ మురళీ మోహన్ తెలిపారు. ఈనెల 11వ తేదీన తన చిన్నకొడుకు ఇంటికి వెళ్తున్న సమయంలో శేషగిరి నాగమ్మను దున్నపోతు పొడిచింది. కర్నూలు ఆస్పత్రికి తరలించి చికిత్స అందించగా కోలుకోలేక మృతి చెందింది. మృతురాలి కుమారుడు శేషగిరి రాముడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందించినట్లు సీఐ తెలిపారు.